కాలువ పూడిక తొలగింపు చేపట్టాలి

- నీరు పారక ఎండిపోతున్న కృష్ణా కాలువ
- ఎక్కడికక్కడ పేరుకుపోయిన గుర్రపు డెక్క
- పంట బోదెను తలపిస్తున్న కాలువ
- ఇదీ ఏలూరు కృష్ణా కాలువ పరిస్థితి


ఏలూరు రైల్వే స్టేషన్ ప్రాంతంలో నీరు లేక ఎండిపోయిన కృష్ణా కాలువ


పాత బస్టాండ్ ప్రాంతంలో గుర్రపు డెక్కతో పూడుకుపోయిన కాలువ

ఏలూరు (టూటౌన్): పూర్తి స్థాయిలో నీరు పారక, పారే అవకాశం ఉన్నా పేరుకుపోయిన గుర్రపు డెక్క, వ్యర్థాలు వెరసి కృష్ణా ప్రధాన కాలువ కాస్తా పంట బోదెను తలపిస్తోంది. దీంతో కాలువ పలు చోట్ల పూర్తిగా ఎండిపోయి కనిపిస్తుంది. ఇప్పటికే కృష్ణా కెనాల్ ఆయకట్టు పరిధిలోని రైతులకు పూర్తి స్థాయిలో సాగు, తాగు నీరందక అవస్థలు పడుతున్నారు. కృష్ణా కాలువలో కనీసం పూడిక పనులు చేపట్టక పోవడంతో గుర్రపుడెక్క విపరీతంగా పేరుకుపోయింది. పూర్తి స్థాయిలో వ్యర్థాలతో నిండిపోయి సాగు నీరు కిందకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో దీని ఆయకట్టు రైతులు పూర్తిగా వర్షంపైనే ఆధారపడి సాగు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. కనీసం వచ్చే వేసవిలోనైనా ఏలూరు నగర పరిధిలో కృష్ణా కాలువను ప్రక్షాళన చేసే విధంగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సాగు నీరందక రైతుల ఇబ్బందులు

కృష్ణా కాలువ నీటి ద్వారా దెందులూరు నియోజకవర్గం పరిధిలోని పెదపాడు, ఏలూరురూరల్, దెందులూరు మండలంలో కొంతమేర పంట పొలాలు సాగవుతున్నాయి. కృష్ణా కాలువ నీరు అందకపోడంతో దెందులూరు మండలంలో ఆయకట్టు రైతులు గోదావరి నీటిని ఇంజన్ల ద్వారా తోడుకోవడం లేదా చెరువుల నీటితో సాగు చేసే ప్రయత్నం చేస్తున్నారు. పెదపాడు మండల రైతులు కొద్దిపాటి కృష్ణా జలాలతో పాటు వర్షం నీటి ఆధారంగా సాగు చేస్తున్నారు. దీనికి భిన్నంగా ఏలూరు రూరల్ రైతుల పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోదావరి జలాలను పోణంగి పుంత ద్వారా అందించేందుకు ఏర్పాట్లు చేసినా పూర్తి స్థాయిలో అందడం లేదనేది రైతుల వాదన. దీంతో ఏలూరు రూరల్ మండల రైతులకు కృష్ణా కాలువ ద్వారా వచ్చే సాగునీరే ఆధారంగా ఉంది. ఈ క్రమంలో సాగు, తాగు నీరు అందించే కృష్ణా కాలువ పూడుకుపోవడంతో పారే కొద్దిపాటి నీరు కూడా రావడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలువను ప్రక్షాళన చేయాలి



కృష్ణా కాలువను ప్రక్షాళన చేయాలి. ఆయకట్టు రైతుల పరిస్థితి ముంపునకు ముందు సాగుకు వెనుక అనే చందంగా ఉంది. ప్రతి వేసవిలోనూ చేపట్టాల్సిన తాత్కాలిక పూడిక తీత పనులు కూడా చేపట్టకపోవడంతో దిగువ ప్రాంతాలకు సాగునీరు అందని పరిస్థితి తలెత్తింది. కనీసం ఈ వేసవిలోనైనా కాలువ పూడిక తీత పనులు శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలి. అప్పుడే రైతుల సాగు నీటి సమస్య తీరుతుంది.

–కె.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి, ఏపీ రైతు సంఘం, ఏలూరు

గుర్రపు డెక్క, తూడు తక్షణం తొలగించాలి



కృష్ణా కాలువలో ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు, వ్యర్థాలను తక్షణం తొలగించాలి. ప్రతి ఏటా కాలువ పూడిక తీత పనులు చేపట్టే విధంగా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టాలి. పూర్తిస్థాయిలో దిగువకు సాగునీరు అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణా కాలువ ఆయకట్టు శివారు ప్రాంత రైతుల సమస్యను పరిష్కరించే విధంగా యుద్ధ ప్రాతిపదికన కృష్ణా కాలువ పూడిక తీత పనులు చేపట్టాలి.

–బైరెడ్డి లక్ష్మణరావు, కౌలు రైతు, ఏలూరు

క్లుప్తంగా

100 మందికి వైద్య పరీక్షలు


రోగులకు మందులను పంపిణీ చేస్తున్న వైద్యులు

ఏలూరు (టూటౌన్): స్థానిక ఆర్ఆర్‌పేటలోని సరస్వతి ఆసుపత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ అక్కెం నరేష్ ఆధ్వర్యంలో వైద్యులు రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు మందులను ఉచితంగా అందజేశారు. వైద్య శిబిరంలో 100 రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి), మధ్యాహ్నపు బలరాం, పీఎస్ఆర్ నాగేశ్వరరావు, దాకారపు రాజేశ్వరరావు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో శ్రీ రాట్నాలమ్మ తల్లి

పెదవేగి: రాట్నాలకుంట గ్రామంలో వేంచేసియున్న శ్రీ రాట్నాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు జిల్లా నలుమూలలనుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈవారం అమ్మవారికి పూజాటిక్కెట్లపై రూ.32,600, విరాళాల రూపంలో రూ.20,100, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ.21,510, వెరశి మొత్తం రూ.74,210 ఆదాయం లభించినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ తెలిపారు.

అచ్చమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


విశేషాలంకరణలో అచ్చమ్మ పేరంటాలమ్మ

దెందులూరు: గాలాయగూడెంలోని శ్రీ అచ్చమ్మ పేరంటాలు తల్లి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శర్మ అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారిని గ్రామంలో మేళతాళాలతో ఊరేగించారు. భక్తులకు అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ ప్రాంగణంలోని భీమ నాగ లింగేశ్వరస్వామి ఆలయంలో గ్రామ కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్ తోట అచ్చియ్య, తోట అశోక్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గంగానమ్మకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో గంగానమ్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక తూర్పువీధిలో 150 సంవత్సరాల చరిత్ర కలిగిన గంగానమ్మ, మహాలక్ష్మి, పోతురాజు ఆలయంలో లోక కల్యాణార్థం గంగానమ్మకు పవిత్ర స్నాన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగానమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు భక్తులు సమర్పించిన నైవేద్యాలు, పండ్లు, పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణం తా అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు అమ్మవారికి నీరాజన, మంత్ర పుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సీహెచ్ సత్యనారాయణ విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు వంకినేని భాను ప్రకాష్, వంకినేని మహేంద్రకుమార్, ముసునూరి బాలాజీ, ఎడ్లపాటి రాము కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు




కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని పేరయ్య కోనేరు ప్రాంగణంలో రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రామకోటి సమాజ 93వ వార్షిక మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఏడు నుంచి ఎనిమిది గంటల వరకూ విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం, నిత కల్యాణం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు నగరంలోని అంబికామాత ఆలయ అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో సామూహిక బీజ సప్తశతి హోమం నిర్వహించారు. సాయంత్రం ఐదున్నర గంటలకు సంస్కృత పండితుడు మైలవరపు లక్ష్మీనరసింహం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి ఏడు గంటలకు నగరానికి చెందిన నృత్యాంజలి కళా నికేతన్ ఆధ్వర్యంలో నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. దివాకరుని వేంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వరశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా రామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్‌కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకి ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే జిలానీ

ఏలూరు (టూటౌన్): విద్యుత్ బస్సుల నిర్వహణ బాధ్యతను ఆర్టీసీకి ఇవ్వాలని, ప్రైవేటు వారికి ఇవ్వరాదని ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎస్‌కే జిలానీ డిమాండ్ చేశారు. స్థానిక నరసింహారావుపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఈ మేరకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న కామ్రేడ్ జిలాని భాషా మాట్లాడుతూ విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకి ఇవ్వడం ద్వారా బలోపేతం చేయడానికి, తద్వారా ప్రజా రవాణా బలపడుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను వెంటనే ప్రకటించాలని, ఎరియర్స్ ఇవ్వాలని, 12వ పీఆర్సీ కమిటీ వేయాలని, ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, గతంలో ఆపిన ఎస్ఆర్బీఎస్ స్కీమును పునరుద్ధరించాలని, 30 సంవత్సరాలు పూర్తైన వారికి మూడు వేల రెండు వందలు ఎస్ఆర్బీఎస్ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ముసాయిదా నివేదికను, కర్తవ్యాలు ప్రవేశపెట్టారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య, ఉప ప్రధాన కార్యదర్శి కట్టా సుబ్రహ్మణ్యం, ఇ.శివకుమార్, రాజశేఖర్, రామయ్య, సత్యనారాయణ, అప్పడు, ఎం.అరుణకుమారి, టీపీఆర్ దొర పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవార్ల గ్రామోత్సవం

భీమడోలు: భీమడోలులోని గ్రామదేవతలు శ్రీమద్దిరామమ్మ, శ్రీమహాలక్ష్మమ్మ, శ్రీగంగానమ్మ, శ్రీపోతురాజుల జాతర మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో అమ్మవార్ల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో గణాచారులు కలిసి పంబలవారు అమ్మవార్లకు సంబరం నిర్వహించారు. అనంతరం ఘటాలతో ఊరేగింపుగా గ్రామవీధుల్లో ఊరేగారు. గ్రామస్తులు అమ్మవార్లకు చల్దిన్నం, బెల్లం సమర్పించారు. గణాచారులు అమ్మవార్లను నెత్తిన పెట్టుకుని గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భీమడోలులోని పలు ప్రాంతాల్లో అమ్మవారిని ఊరేగించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దేవుని మార్గంలో నడవాలి


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఫాదర్లు


ఆధ్యాత్మిక సందేశమిస్తున్న పాల్ దినకరన్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భక్తులు దేవుడి మార్గంలో నడుస్తూ నీతిమంతులుగా జీవించాలని ఏలూరు కథోలిక పీఠం ప్రొక్యూరేటర్ ఫాదర్ బేదంపూడి రాజు సూచించారు. స్థానిక గ్జేవియర్ నగర్‌లోని అమలోద్భవి మాత కథీడ్రల్ మహాదేవాలయం 37వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఏలూరులో ఈ వేడుకలను మూడు రోజులు నిర్వహించనున్నారు. వంగాయగూడెం మదర్ థెరిస్సా విచారణ కర్త ఫాదర్ జుజ్జువరపు మైఖేల్ మాట్లాడుతూ విశ్వాసులు మరియ తల్లి, లూర్థుమాత వలె దేవుని పట్ల వినయ విధేయతలతో జీవించాలని సూచించారు. ఫాదర్లు ఎన్.విద్యాసాగర్, ఎం.జోసఫ్, కార్పొరేటర్ ఎం.నిర్మల, జె.బెనర్జీ, డి.అబ్రహాం, ఎస్.థామస్, ఐ.రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ప్రార్థనా పండుగలు

నగరానికి చెందిన మన్నా చర్చ్ ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీ నుంచి స్థానిక ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో ఏసు పిలుచుచున్నాడు పేరిట నిర్వహిస్తున్న ప్రార్థనా పండుగలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా అంతర్జాతీయ సువార్తికుడు పాల్ దినకరన్ సందేశమిచ్చారు. బిషప్ జాన్ ఎస్‌డీ రాజు, ఇవాంజెలిన్ పాల్ దినకరన్, ఎం.ఎలీషారాజు, ఎం.జ్యోతిరాజు, సునీత, శామ్యూల్ దినకరన్, స్టెల్లా రమోలా, డేనియల్ డేవిడ్సన్ దేవుని వాక్య సందేశం అందించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	20
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	25
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	24
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	12	చిక్కుడు కాయలు	36
వంకాయలు (కాంతులు)	20	బీన్లచిక్కుడు	48
వంకాయలు (తెలుపు)	20	చామదుంపలు	44
బెండకాయలు	40	ముల్లంగి/ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	24	కంద	72
కాకర కాయలు	32–44	బీట్‌రూట్	32
బీరకాయలు	00	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	48	ఫ్రెంచ్‌బీన్స్	60
క్యాబేజీ	20	అల్లం	50
క్యారెట్	32	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	30	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	28	గోంగూర	07–10
దోసకాయలు	24–36	పుదీనా	05
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20–25	చిలకదదుంప	40

శిథిలావస్థలో కొవ్వలి వంతెన


శిథిలావస్థకు చేరుకున్న కొవ్వలి వంతెన



1939లో ప్రారంభించిన శిలాఫలకం

దెందులూరు: కొవ్వలి వంతెన శిథిలావస్థకు చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోదావరి కాల్వపైన దాదాపు 12 గ్రామాల ప్రజలకు ఉపయోగపడేలా 1939 సంవత్సరంలో ఈ వంతెన ప్రారంభించారు. దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా ఈ వంతెన సేవలందించింది. ప్రస్తుతం వంతెన గోడలు, బ్రిడ్జి కమ్మీలు శిథిలావస్థకు చేరాయి. ఈ వంతెనపై చేపల లోడు లారీలు సైతం వెళుతుండడంతో వంతెన ఏ క్షణాన కూలిపోతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు వంతెనను పరిశీలించి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సుజుకి యాక్సెస్ వాహనం విడుదల


సుజుకి యాక్సెస్ వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సుజుకి యాక్సెస్ వాహనాన్ని పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఏలూరు మార్కెట్‌లోకి విడుదల చేశారు. స్థానిక హోటల్ ఎన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ వాహనాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే బడేటి చంటి, ఎస్ఎంఆర్ పెదబాబు, రెడ్డి అప్పలనాయుడు, శ్రీకృష్ణ సుజుకీ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి


కొండలరావుపాలెంలో నాయకులు, కార్యకర్తలను కలిసిన కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి : దెందులూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొఠారు అబ్బయ్యచౌదరిని ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిశారు. ఎనిమిది నెలలుగా కూటమి ప్రభుత్వం వల్ల తాము పడుతున్న ఇబ్బందులను ఆయనకు విన్నవించారు. అక్రమ కేసులు పెడుతున్నారని, 41 నోటీసులు ఇచ్చి వేధింపులకు గురి చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ శాఖల ఉద్యోగులు సైతం పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఇది ఎంతో ఆవేదన కలిగిస్తోందని అన్నారు. గ్రామంలో ఎవరో తెలియని వ్యక్తులు ఫ్లెక్సీని రాయితో కొడితే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టారని ఎటువంటి ఆధారాలు లేకుండా వేధింపులు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కార్యదర్శి స్టాలిన్, గ్రామ నాయకులు విజయ్, రాజేష్, రవి, విష్ణు కుమార్ జోజి శ్రీను వెంకటేష్ వివరించారు. దీనిపై అబ్బయ్యచౌదరి స్పందిస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, పార్టీ పెదవేగి మండల అధ్యక్షుడు జానంపేట ప్రసాద్ బాబు, పార్టీ జిల్లా కార్యదర్శి మెట్లపల్లి సూరిబాబు, పెదవేగి సొసైటీ మాజీ అధ్యక్షుడు పెను మాక సుబ్బారావు, లేగల శివ, పెదవేగి మండలంలో వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు అబ్బాయి చౌదరిని కలిశారు.

బాధితులందర్నీ పరామర్శిస్తా

దెందులూరు: నియోజకవర్గంలో కూటమి నేతల కారణంగా ఇబ్బందుల పాలైన బాధితులందరినీ కలిసి పరామర్శిస్తానని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఆదివారం కార్యాలయంలో ఆయన్ను దెందులూరు మండలంలోని నాయకులు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున కలిశారు.